# జాలారి బాల

*శిక్ష స్మృతిలో ఎలా అయినా ఉండవచ్చు; తెలియక చేసిన తప్పు మాత్రం దండనార్హం కాదు. ఆ తప్పు అంటూ చేయకుండా ఉంటే జీవితానికి సాఫల్యమే ఉండక పోను. కాని జీవితం సఫలమైనదని ఆ అమాయిక హృదయానికి తెలియ జెప్పే వారెవరు?*

సాయంకాలం షికారుకెళ్లి తిరిగి వస్తున్నారు రిటైర్డ్ కలెక్టరు జగన్నాధంగారు, డాక్టరు శంకరనారాయణగారు. ప్రొద్దు అప్పుడే గూట్లో పడింది. చీకటి చిక్కగా పరుచుకొంటూంది. ఇద్దరూ బంగళా గేటుదగ్గరి కొచ్చేసరికి గేటు మీద కూచొని అదేపనిగా అరుస్తున్న బెల్లబాయి కేరుమంటూ పారిపోయింది. గేటు తెరిచి లోపలి కెళ్లారు జగన్నాధంగారు. వారిని అనుసరించారు డాక్టరుగారు. డాక్టరుగార్ని చూడగానే ఒకే పరుగున వచ్చాడు తోటమాలి రంగడు

"సూడు సామీ ! కాలికి ఓపెద్ద దెబ్బ తగిలింది. శానానొప్పిగా వుండాది" అన్నాడు.

"ఎందుకు తగిలిందిరా అంత పెద్ద దెబ్బ ?" ప్రశ్నించారు జగన్నాధంగారు.

రంగడు సిగ్గుపడిపొయ్యాడు. ముంచుకొస్తున్న సిగ్గుతో తల గోక్కుంటూ అన్నాడు:

"మా రామి రాత్తో యేసిందండి."

డాక్టరుగారికి నవ్వాగలేదు. విరగబడి నవ్వారు. కానీ జగన్నాధంగారి భృకుటి ఉన్నట్టుండి ముడేసుకుంది. చేతులు వెనక్కు కట్టుకొని బంగళాలోకి నడక సాగించారు. జగన్నాధంగార్ని చూస్తున్న డాక్టరుగారు ఆశ్చర్యపొయ్యారు. మళ్లీ రంగడు అన్నాడు: "రగతం కారతా వుందయ్యా ! మందేయించండి."

రంగణ్ణి ఆస్పత్రికెళ్లి కట్టు కట్టించుకోమని చెప్పి తాను కూడా లోపలికెళ్లారు డాక్టరుగారు. జగన్నాధంగారు బంగళా వరండాలో కూచొని



గుడ్డి వెన్నెల్లో స్నానం చేస్తున్న తోటను చూస్తున్నారు.

"రంగ డామాట చెప్పగానే ఎందు కదోలా అయిపొయ్యారు ?" కూర్చుంటూ ప్రశ్నించారు డాక్టరుగారు.

"ఏం లేదు. ఏదో అనుభూతి రేగింది."

"మధురమైందా ? విషాదమైందా ?"

"విషాదమైనా మాధుర్యం వున్నదే !"

"అభ్యంతరం లేకపోతే చెప్పండి. నేనూ వింటాను. ఈ వయస్సులో అలాంటి స్మృతుల కన్నా మరేమీ మధురంగా వుండవు" అన్నారు డాక్టరుగారు.

జగన్నాధంగారు ఒక చిన్న చిరునవ్వుతో అంగీకారాన్ని సూచించి, పాడిదగ్గు దగ్గి, కళ్ల జోడు తీసి అంగవస్త్రంతో తుడుస్తూ ప్రారంభించారు—

"అప్పుడు నేను బియ్యే మొదటి ఏడు చదువుతున్నాను. ఏదో సెలవుల్లో మా మామగారింటికి అరగొండ వెళ్లాను. అరగొండంటే మామూలు ఊరుకాదు. భూమిమీదికి దిగివచ్చిన నందనవనం. ఊరి కానుకొని పారే సెలయేరు, ఏట్లో తెల్లటి ఇసకా, అందులో కన్నెపిల్ల పాపటలా పారే నీటి పాయ, ఏటి గట్లమీద మొగలి పొదలు, ఊరికి పడమట ఉన్నతమైన కొండ, ఆ కొండ వెనక సూర్యాస్తమయం, చుట్టూరా పూలతురాయిలాలు సంతరించుకున్న చెరుకు తోటలు—ఓ చాలా అందంగా ఉంటుం దా ఊరు."

"ఈవర్ణనకూ ఆసంఘటనకూ సంబంధం?"

"ఉంది. . .అరగొండకు వెళ్తే నాకు పంట కుప్పలవద్ద పడుకోవడమంటే చాలా సరదా ! ఒక రోజు రాత్రి—నాకు బాగా జ్ఞాపకం, చీకటి రాత్రి — నేను, మా మామయ్య కొడుకు చంద్రం కుప్పల కావలి కెళ్లాం—నక్క బండ పైకి. తొమ్మిది గంటలయ్యేసరికి నా ధర్మమా అంటూ సినిమాకు బయల్దేరాడు చంద్రం. నేనొక్కణ్ణేగుడిసెలో మంచంమీదపడుకున్నాను.. కొత్త చోటు, కీచురాళ్ల శబ్దం, శిథిలమైపోయిన మంచం, నాకు నిద్రను దూరం చేశాయి. అలాగే పొర్లుతూ పడుకున్నాను.అర్ధరాత్రయి వుండచ్చు—గుడిసెకు ఎడం వైపునున్న రాగి వెన్ను కుప్పల వద్ద సరసరమని శబ్దం వినిపించింది.

మంచంమీదనుంచి లేచి, దిండు క్రిందనుంచి టార్చిలైటు అందుకొని కుప్పలకేసి బయలు దేరాను. ఇంకా శబ్దం వినబడుతూనే ఉంది. ఎవరో కుప్పలోంచి రాగి వెన్ను లాగుతున్నట్లున్నారు. . .శబ్దం చేయకుండా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్లి టార్చిలైటు వెలిగించి శక్తికొద్దీ అరిచాను.

"ఏయ్ ! ఎవర్రా అది ! నిలు. . ."

అప్పుడే కుప్పలో నుంచి లాగిన రాగి వెన్ను అలాగే చేతులో ఉంది. అతడు ఆశ్చర్యంతో అలాగే నిలబడిపొయ్యాడు. అతడికి పారిపోవాలని కూడా తోచలేదు. జవాబు చెప్పకుండా గుడ్ల

# వల్లంపాటి వెంకటసుబ్బయ్య

మిటకరిస్తూ అలాగే నిలబడ్డాడు. ధైర్యం చేసి మొండిగా, బండగా దగ్గరికెళ్ళి అతని ముఖానికి టార్చిలైటు వేశాను. ఒక్క క్షణం స్తంభించి పొయ్యాను. అతడికి పన్నెండేళ్లయినా లేవు. ఇంకా మీసాలు రాని వయస్సు ! అప్పుడే కుప్పల దొంగతనం ! ఒళ్ళు మండుకొచ్చింది.

"ఏయ్! జవాబు చెప్పు. వీపు చీల్చేస్తాను...." ఆ కుర్రాణ్ణి కొట్టడానికి చెయ్యెత్తాను... వడిసెలలో నుంచి వచ్చినట్లుగా ఒక రాయి వచ్చి వీపుకు తాకింది. నరాలన్నీ ఒక్కసారిగా జల్లుమన్నాయి. రక్తమంతా తలకెక్కినట్లయి తల తిరిగి పడిపొయ్యాను.

నాకు మళ్లీ తెలివొచ్చేసరికి గుడిసెలో కుక్కిమంచంమీదున్నాను. సినిమా నుంచి వచ్చిన చంద్రం ఆతురత నిండిన కళ్లతో నా వైపు చూస్తున్నాడు. ఎవరో ఒక పడుచు నీళ్లు నిండిన కళ్లతో నా ముఖంలోకి చూస్తూ ఉంది. ఆవిడ తల్లో జాలారి పూవులు గుబాళిస్తున్నాయి.

"ఎలా ఉంది" చంద్రం ప్రశ్నించాడు.

"తల దిమ్ముగా ఉంది" అన్నాను.

ఆ అమ్మాయి కళ్లు తుడుచుకుంది.

మరి కాస్సేపటికి ఆ అమ్మాయి ఎవరని అడిగాను. చంద్రం చెప్పాడు.

"ఈ ఎడంవైపున్న చేనే వాళ్లది. ఈ అమ్మాయి, వాళ్ల అమ్మ ఇద్దరూ కావలి పడుకుంటారు. బండమీద కుప్పలవద్ద ఏదో అల్లరి వినిపిస్తే ఈ అమ్మాయి రాయి విసిరింది. ఆ రాయే నీకు తగిలింది."

ఆ అమ్మాయి వేపు చూశాను. కళ్లలో నీళ్లలాగే ఉన్నాయి. పాపం ! జరిగిన పొరపాటుకు ఎంత విచారిస్తూంది !

"ఫరవాలేదులెండి. తెలీక జరిగిన తప్పు" అన్నాను.

ఆ అమ్మాయి ఎంత ఉగ్గబట్టుకున్నా ఏడుపు ఆగలేదు. కొంగు నోటికడ్డంపెట్టుకొని గుడిసెలోనుంచి వెళ్లిపోయింది.

తర్వాత అరగొండలో నాలుగు రోజులున్నాను. పొలానికి వెళ్తూనో, తిరిగి వస్తూనో, చేను వద్దా, నక్కబండ దగ్గరా అవుల్ని మేపుతూనో ఆ అమ్మాయి కనిపించేది. నన్ను చూడగానే ఆ అమ్మాయి ముఖం చిన్నదైపోయేది. విషాదంగా ఒక చిరునవ్వు నవ్వేది. . . ఆ చిరునవ్వు నాలో నాకు తెలీకుండానే అలజడిని రేపింది. ఆ విశాలమైన నుదురు, అందులో నిప్పుకణికలాంటి ఎర్ర కుంకుమబొట్టు, వదులుగా వేళ్లాడే జడలో జాలారి పూలు, ముదురాకు పచ్చ చీరలోనుంచి మిడిసిపడే అవయవాల పొంకం, అన్నిటినీ మించి ఆ కళ్లలో ముత్యాల్లా నిలిచే కన్నీటిబొట్లు నన్ను వెంటాడేవి. . .మరి రెండు రోజుల్లో కాలేజీలు తెరిచారు. . .నేను పట్నం వెళ్లిపొయ్యాను.

అప్పటినుంచీ బియ్యే పూర్తయేదాకా చంద్రానికి ఆ అమ్మాయిని గురించి ఉత్తరాలు రాసేవాణ్ణి. ఆ అమ్మాయి గూడా నన్నుగురించి ఏదేదో అడుగుతుందని, నేనంటే చాలా ఇష్టమని చంద్రం రాసేవాడు. ఆ ఉత్తరాలింకా నా దగ్గరున్నాయి. మనసుకు చీకూ చింతా తాకితే ఆ ఉత్తరాలు చదువుకుంటాను. . .నేను బియ్యే పాసవగానే నాకు మా వాళ్లు పెళ్లి చెయ్యాలనుకున్నారు. ఆ మాట తెలియగానే నేను అరగొండకు వెళ్లాను. ఆ అమ్మాయిని గురించి చంద్రాన్ని అడిగాను.

"ఎవరు ? నీ జాలారి పూల పడుచును గురించేనా ? ఈలోగా వాళ్లమ్మ చనిపోయింది. వాళ్ల మామయ్య వచ్చి ఆ చేనూ కొంపా అన్నీ అమ్మేసి తనతోకూడా ఆ పిల్లను పిలుచుకుపొయ్యాడు. ఎక్కడైనా అనాధాశ్రమంలో చేరుస్తానన్నాడట."

"ఏ ఊరికో తెలుసా ?"

"నాకేం తెలుసు. బహుశా నాన్నగారికి తెలుసేమో !"

"అప్పటికిగానీ ఆ జాలారి పూల పడుచును ప్రేమిస్తున్నానని నాకు అర్థంగాలేదు. ఆ జాలారి పూల పడుచు ఇక నాకు లభ్యంకాదని తెలిపోయింది. మనస్సులో వెయ్యి గ్రీష్మాలు ఈచుకుపొయ్యాయి. పెళ్లంటే ద్వేషం ఏర్పడింది. ఆ ద్వేషంతోనే విదేశాలకు వెళ్లిరావటం, ఉత్తర దేశంలో రెండు మూడేళ్లు ఉద్యోగం చెయ్యటం జరిగాయి. కానీ పెళ్లిమాత్రం చేసుకోలేదు..." జగన్నాధంగారు ఆగారు. వారి కనుబొమ్మల ముడిలో బాధ చిక్కుకుంది. ఆలోచిస్తూ తోటలో వెన్నెలతో కలిసి కురుస్తున్న చీకటిని చూస్తున్నారు.

"అలాగైతేవివాహంఎప్పుడు చేసుకున్నారు?" డాక్టరుగారు ప్రశ్నించారు. కానీ జగన్నాధంగారి కా ప్రశ్న వినిపించినట్లేలేదు. వారలాగే తోటలోకి చూస్తున్నారు.

జగన్నాధంగారి భార్య సీతాలక్ష్మమ్మ భర్తను భోజనానికి పిలవడానికి వచ్చింది. కానీ డాక్టరుగార్ని చూసి ఆగిపోయింది. భార్యను చూస్తూ జగన్నాధంగారు చెప్పుకుపోసాగారు—

"మళ్లీ సీతను చూసేదాకా పెళ్లి చేసుకోవాలనిపించలేదు. నేను మద్రాసులో డెప్యూటీ కలెక్టరుగా పనిచేస్తున్నప్పుడు సీతను చూశాను. ఒక ప్రయిమరీ స్కూల్లో టీచరుగా పనిచేస్తూండేది. సీతను చూడగానే ఆ జాలారి పూల పడుచు మనసులో మెదిలింది. వివాహం చేసుకోవడానికి ఇష్టమేనా అని సీత నడిగాను. మొదట నమ్మలేకపోయినా చివరకు అంగీకరించింది. కాస్త పెళ్లీడు దాటినా ఎవర్నో ఒకర్ని పెళ్లి చేసుకొన్నందుకు మా నాన్నా అమ్మా సంబరపడిపొయ్యారు.

(తరువాయి 56 వ పేజీలో)



# మిసెస్ శారద... పోస్ట్‌మన్

మమ్మల్ని పంపిస్తున్నారు. అక్కడి వెరైటీషోలో మన వేషం శ్రీమతిగారి ముందు 'ప్స్యూటనీ'కి పెట్టాం. మీరు కనిపెట్టలేకపోయారు. అనగా మిసెస్ శారద...మిస్..."

"అబ్బ అరవబోకండి. లోపలికి పదండి" అంది.

అలాగే ఇద్దరూ లోపలికి వెళ్లారు.

"శారదా, వాడెవడే? రామ...రామ..రామ. అయ్యో...రామా...'' అమ్మమ్మగారి బాధ.

"అమ్మమ్మగారు రామకోటి వ్రాయాలిగాని కంఠస్తోత్రం చేస్తే ముక్తిలేదండీ. నేను సుబ్బారావును".

"ఇదేం వేషం నాయనా?"

''మీ మనుమరాలి సరదా అండి ఇది. ఇలా వస్తే గాని దర్శనం ఇవ్వనంది.''

"ఓసి నీ యిల్లు బంగారంగానూ" అంది బామ్మగారు బోసినోటితో నవ్వుకుంటూ వంటిట్లోకి ఫేడౌట్ అవుతూ.

"ఏదీ కొంచెం బంగారం పెడ్తావూ.. మిస్ శారదా... కాదు... మిసెస్ శారదా సుబ్బారావు గారూ...కాదు...కాదు... మిసెస్ శారదా పోస్ట్‌మన్‌గారూ."

"ఊఁ" అంది మేఘమాలికలా మిసెస్ శారద అతని చేతుల్లోంచి మిస్ అవుతూ.

"ఊహూఁ" అన్నాడు సాగదీస్తూ. గట్టిగా చెయ్యి పట్టుకుని, చందమామలా, సుబ్బారావులా, పోస్ట్‌మన్‌లా... ఆమెను మిస్ కాకుండా...

గోడమీద ఫోటోలో సీతారాములు సిగ్గుగా నవ్వుకున్నారు. అద్దం సిగ్గుచేత మరింత కంది పోయింది. దూలంమీద బల్లులు ఆశ్చర్యంగా చూచాయి. పక్క వాటాలో కొత్త జంట నవ్వు నూతిలో స్వరంలా అయిపోయింది శారదా సుబ్బారావులా సంతోషంలో.. హాసంలో... ★





## పూవు మీ అదృష్టం చెప్పగలదు



నీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, ఆకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగు వానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్ట గ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AW-13) Jullundur City.**


# జాలారి బాల

(51వ పేజీ తరువాయి)

సీత ముఖంలో ఆ జాలారి పూల పడుచు ముఖం చూసుకుంటూ, వీపుమీద మచ్చను తడివిచూసుకొని ఆ ఆనందప్రదమైన స్మృతుల్ని బలవంతంగా రేపుకుంటూ, అరగొండకు అప్పుడప్పుడూ వెళ్లి ఆ కొండ, కొండ వెనుక సూర్యాస్తమయం, సెలయేరు, మొగలిపొదలు చూసివస్తూ జీవితాన్ని లాగేశాను. కానీ డాక్టరు గారూ ! జీవితం చాలా విచిత్రమైంది. లేకుంటే నాకూ సీతకూ మధ్య ఉన్న ఈ రహస్యం ఈనాటి దాకా ఎందుకు బయటపడకపోవాలి ?. . .కానీ... మానవుడు కూడా చాలా దుర్బలుడు. . .కాక పోతే..." తలెత్తి భార్యకేసి చూసిన జగన్నాథం గారు ఆగిపొయ్యారు.

సీతాలక్ష్మమ్మగారి కళ్లలో నీళ్లు చెంపల మీదికి జారబోతున్నాయి. ఆవిడ ముఖం ఒక ఆనందజ్యోతై వెలిగిపోతూంది.

"ఎందుకు, సీతా, అంత ఆనందం? అంత కన్నీళ్లూ ?" జగన్నాథంగారు ప్రశ్నించారు.

ఆవిడ జవాబు చెప్పలేకపోయింది. జగన్నాథం గారూ, డాక్టరూ అలాగే నిశ్శబ్దంగా ఆవిడకేసి చూస్తున్నారు.

ఆవిడ ఏదో చెప్పబోయి అంతలో అంతటి వృద్ధాప్యంలో సిగ్గు ముంచెత్తుకురావడంతో అక్కడ నిలబడలేక లోపలికి వెళ్లిపోయింది.

షష్టిపూర్తి చేసుకోబోతున్న జగన్నాథం గారు ఒక్క అంగలో లోపలి కెళ్లారు. డాక్టరుగారి కేమీ అర్థంగాలేదు. ఏదో భావం అందీ అందకుండా వారి తలలో గిరికీలు కొడుతూంది. ఐదు నిమిషాల తర్వాత జగన్నాథంగారు తిరిగొచ్చారు. వారిని చూడగానే డాక్టరుగారు ఆశ్చర్యపోయారు. పరిచయమైన పదిహేనేళ్లనుంచీ ఇంత ఆనందంగా, ఇంత ఉల్లాసంగా జగన్నాథంగార్ని డాక్టరుగారు ఏనాడూ చూడలేదు. జగన్నాథంగారి ముఖం మబ్బులు వదిలిన ఆకాశంలా, కుబుసం ఊడ్చిన నాగంలా కాంతివంతంగా ఉంది. వారు వచ్చి సోఫాలో కూర్చుంటూ ఆనందంతో, తన్మయత్వంతో చెప్పుకుపోసాగారు.

"చూశారా డాక్టరుగారూ! నే చెప్పలేదూ? జీవితం చాలా విచిత్రమైంది. ఈరోజు నాకు చాలా ఆనందంగా ఉంది. . .కానీ ఒక్కటే చింత! జాలారి పూల పడుచు సంగతి సీత దగ్గర దాచి ఎంత ఆనందానికి దూరమయ్యానా అని. . . ఇంకో విషయమండోయ్. . .సీత ఇంకెప్పుడూ నన్ను రాత్తో రప్పతో కొట్టనని వాగ్దానం చేసింది." ★